సాక్షి మంచిర్యాల

శుక్రవారం, 2, ఆగస్టు, 2024



వామ్మో.. రక్తపింజరలు

బెల్లంపల్లి పట్టణంలో విషసర్పాల సంచారం విపరీతంగా పెరిగింది. నాముపాము, కొంచిలు వలు, ప్రమాదకరమైన రక్తపింజరలు సంచరి స్తుండడం ఆందోళనకు గురిచేస్తోంది. 8లో▸

కాలేజీకి పక్కా భవనం నిర్మించాలి

దండేపల్లి: దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీకి పక్కా భవనం నిర్మించాలని యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ కాలేజీకి పక్కా భవనం నిర్మించకపోవడంతో అరకొర వసతుల మధ్య నిర్వహిస్తున్నారని తెలిపారు. అనంతరం తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. యూఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు వరుణ్‌సందేశ్, అఖిల్, సభ్యులు విష్ణువర్ధన్, శివవర్మ, కృష్ణ, అక్షయ, పవిత్ర, వైష్ణవి, శాన్విత, అర్చన, శివాని తదితరులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
29.0 /26.0

వాతావరణం

చిరుజల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. నైరుతి దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

వ్యాధులు ప్రబలకుండా చూడాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- బాధ్యతలు చేపట్టిన డీఎంహెచ్‌వో



కలెక్టర్ ను కలిసిన డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

మంచిర్యాలటౌన్: వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంచిర్యాల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ హరీశ్ రాజ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్ నాయక్, సూపరింటెండెంట్ విశ్వేశ్వర్‌రెడ్డి, డీపీవో ప్రశాంతి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి

వేమనపల్లి: అధికారులు అంకితభావంతో పని చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో, ఉపాధి హామీ కార్యాలయాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రహదారికి ఇరువైపుల ఖాళీగా ఉన్న చోట మొక్కలు నాటాలని సూచించారు. పీహెచ్‌సీకి వెళ్లి స్టోర్‌రూమ్, పరిసరాలు పరిశీలించారు. స్టాఫ్‌నర్స్ పోస్టు భర్తీ చేయాలని వైద్యాధికారి రాజేష్ కోరారు. వేమనపల్లి జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపట్టికను తనిఖీ చేశారు.

కలెక్టర్ అసహనం

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద కలెక్టర్ కుమార్ దీపక్‌కు స్థానికులు పలు సమస్యలపై ఏకరువు పెట్టగా ఆయన ఒకింత అసహనానికి గురయ్యారు. శానిటేషన్ చెపట్టడం లేదని, వీధి దీపాలు వెలగడం లేదని, వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం లేదని విన్నవించారు. ఒడ్డుగూడంలో తాగునీటి సమస్యను కార్యదర్శి పట్టించుకోవడం లేదని, తామే చందాలు వేసుకుని మరమ్మతులు చేయించుకున్నామని గ్రామస్తులు తెలిపారు.

సీఓఈ ఇంచార్జి ప్రిన్సిపాల్‌గా రమాదేవి



ఇంచార్జి ప్రిన్సిపాల్ రమాదేవి

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్‌గా దుర్గం రమాదేవి నియామకం అయ్యారు. ఈ మేరకు గురువారం ఆమె బాధ్యతలు చేపట్టారు. రెగ్యులర్ ప్రిన్సిపాల్ మంగళపల్లి శ్రీనివాస్ బుధవారం ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో సీనియర్ అధ్యాపకురాలిగా పని చేస్తున్న రమాదేవికి ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు. ఇంచార్జి ప్రిన్సిపాల్‌కు వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

డీసీఈబీ సభ్యుడిగా ఇఫ్తేఖర్

చెన్నూర్: జిల్లా విద్యాశాఖ డీసీఈబీ సభ్యుడిగా చెన్నూర్ పట్టణానికి చెందిన ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ ఇఫ్తేఖర్ అలీని నియామిస్తూ జిల్లా విద్యాధికారి యాదయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఇఫ్తేఖర్ అలీ మాట్లాడుతూ జిల్లా కామన్ ఎగ్జామ్స్ బోర్డు సభ్యుడిగా నియమించిన డీఈవోకు కృతజ్ఞతలు తెలిపారు.

చెన్నూరు లిఫ్టు కంచికేనా?

- 'పద్దనపల్లి'పైనా పట్టింపు కరువు
- గత సర్కారు 'ఎత్తిపోతలు' పక్కకే..
- మళ్లీ 'ప్రాణహిత' నిర్మాణంపైనే ఆశలు
- ప్రభుత్వాల తీరుతో ప్రాజెక్టులపై ప్రభావం



హాజీపూర్ మండలం పద్దనపల్లి ఎత్తిపోతల పథకం శంకుస్థాపన ఫలకాలు(ఫైల్)


సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తలాపునే గోదావరి, ప్రాణహిత నదులు, వాగులు ప్రవహిస్తున్నా ఇక్కడి రైతాంగానికి ఏళ్లుగా సాగునీటి గోస తప్పడం లేదు. ప్రభుత్వాలు సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తామని చెబుతున్నా ముందుకు సాగని దుస్థితి నెలకొంది. దండిగా నీటి వనరులు ఉన్నా పంట పొలాలకు నీరందక రైతులు అవస్థలు పడాల్సి వస్తోంది. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా స్థానిక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రతికూల ప్రభావం పడుతోంది. తాజాగా గత బీఆర్ఎస్ సర్కారు చేపట్టిన చెన్నూర్ ఎత్తిపోతలు, హాజీపూర్ మండలం పద్దనపల్లి ఎత్తిపోతల పథకాలు ఆదిలోనే ఆగిపోయాయి.

నిలిచిన ఎత్తిపోతలు

ఏడాదికి పది టీఎంసీల గోదావరి జలాలను ఎత్తిపోసి 90వేల ఎకరాలకు సాగునీరు అందించేలా చెన్నూర్ ఎత్తిపోతలకు ప్రణాళిక రూపొందించారు. రూ.1600 కోట్లతో ఈ పథకాన్ని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. అప్పటి ఎమ్మెల్యే బాల్క సుమన్ పలుమార్లు సమీక్షలు చేశారు. ఎత్తిపోతల పథకంతో జైపూర్, మందమర్రి, భీమారం, చెన్నూర్, కోటపల్లి మండలాల పరిధిలో 101 గ్రామాల్లో 188 చెరువులు నింపి 90వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలని డిజైన్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో శెట్‌పల్లి వద్ద పార్వతి(సుందిళ్ల), పాక్కూరు శివారులో సరస్వతి బ్యారేజీ(అన్నారం), ఆలుగామ వద్ద లక్ష్మిబ్యారేజీ(మేడిగడ్డ) బ్యాక్‌వాటర్‌ను ఈ మూడు చోట్ల ఎత్తిపోయాలి. 14ప్రధాన కాలువల ద్వారా 36మెగావాట్ల విద్యుత్ సామర్థ్యంతో గోదావరి నీటిని 82మీటర్లు పైకి ఎత్తిపోసి పంట పొలాలకు అందించాలి. ఇందుకు జీవో 133 విడుదల చేస్తూ రూ.1658 కోట్లు పరిపాలన అనుమతులు వచ్చాయి. భూ సేకరణ సర్వే పనులు జరిగాయి. పరిహారం చెల్లింపులకు అంచనా వేశారు. అసెంబ్లీ ఎన్నికలు రావడం, బీఆర్ఎస్ పార్టీ ఓడిపోవడంతో ఈ ఎత్తిపోతల పథకం మూలకుపడింది. తాజాగా రాష్ట్ర బడ్జెట్‌లో ఈ లిఫ్టు ప్రస్తావన లేకపోవడంతో ఈ పథకాన్ని కొనసాగిస్తారా..? లేదా..? అనే సందేహాలున్నాయి.



తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ ప్రతిపాదిత ప్రాంతం



చెన్నూరు ఎత్తిపోతల పథకం డిజైన్

'పద్దనపల్లి' పక్కకే..

గోదావరినదిపై ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలో ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోసి హాజీపూర్ మండలంలో పది వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలని పద్దనపల్లి ఎత్తిపోతల పథకానికి ప్రణాళిక వేశారు. రూ.80.50 కోట్లతో చేపట్టిన ఈ పథకాన్ని అప్పటి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ పథకంలో కడెం డిస్ట్రిబ్యూటరీ 42 కాలువకు అనుసంధానం చేస్తూ ఆయకట్టుకు నీరందించాలి. పద్దనపల్లి–కర్ణమామిడిలో నిర్మించే ఈ పథకంతో ఇక్కడి రైతులకు మేలు జరుగుతుందని ఆశపడ్డారు. కానీ తాజా సర్కారు ఈ ఎత్తిపోతలకూ ఎలాంటి నిధులు కేటాయించలేదు. ఇదే మండలంలో గతంలో ముల్కల్ల శివారులోనే దాదాపు 200 ఎకరాలకు నీరందించేలా ఎత్తిపోతల పథకం సైతం మధ్యలోనే నిలిచిపోయింది.

మళ్లీ 'ప్రాణహిత' పైనే ఆశలు?

2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు బీఆర్ఎస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల డిజైన్ మార్పుతో నిలిచిపోయింది. ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై బ్యారేజీ నిర్మించి ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్రంలో మొత్తం 16లక్షల ఎకరాలకు నీరందించాలి. ఇందులో ఆసిఫాబాద్, సిర్పూర్, బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల నియోజకవర్గాల పరిధిలోనే 2లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టు స్థానంలోనే కాళేశ్వరం ఎత్తిపోతల పథకం చేపట్టి ఆ ప్రాజెక్టుపై అసలు పట్టించుకోలేదు. దీంతో రూ.కోట్లు ఖర్చు చేసి బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల వరకు తవ్విన కాలువలు వృథాగా మారాయి. కాంగ్రెస్ సర్కారులో తాజాగా రాష్ట్ర బడ్జెట్‌లో రూ.248 కోట్లు కేటాయించడంతో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ప్రాజెక్టు ప్రాణహితపైనా..? లేక వార్ధాపైనా..? అనేది పూర్తి స్థాయిలో సర్వే చేశాకే స్పష్టత రానుంది. దీనిపై సాగునీటి అధికారులకు ఇంకా స్పష్టత రాలేదు.

స్వచ్ఛదనం-పచ్చదనం పకడ్బందీగా చేపట్టాలి

- మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో ప్రారంభించాలి
- ఈ నెల 5 నుంచి 9 వరకు నిర్వహించాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



పాల్గొన్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 5 నుంచి 9 వరకు రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అటవీశాఖ అధికారులు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి గ్రామాలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. 6న తాగునీటి సరఫరా, ఇంకుడుగుంతల నిర్మాణం, 7న మురుగు కాల్వలు, నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేయడం, ఇబ్బందికరంగా ఉన్న గుంతలను పూడ్చడం, 8న సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన, వీధి కుక్కల దాడుల నివారణ, చర్యలు చేపట్టడం, 9న డ్రై డే, ప్రభుత్వ సంస్థలను శుభ్రం చేయడం కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ప్రత్యేక బృందాలను నియమించాలని తెలిపారు. ప్రతీ నెల 3వ శనివారం స్వచ్ఛదనం-పచ్చదనం ప్రత్యేక రోజుగా నిర్వహించాలని అన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని, జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జెడ్పీసీఈవో గణపతి పాల్గొన్నారు.

కొందరికే కిసాన్ సమ్మాన్ నిధి

- ఏటేటా తగ్గుతున్న లబ్ధిదారులు
- కొత్తవారికీ అవకాశం కల్పించాలని వినతి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో

కోటపల్లి: రైతులకు పెట్టుబడి అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం అమలు చేస్తోంది. అర్హులైన రైతులకు ఏడాదిలో మూడు విడతలుగా రూ.2వేల చొప్పున మొత్తం రూ.6వేల నగదు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. ఈ పథకం అమలులో ప్రభుత్వ నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. ఏటేటా అర్హులైన రైతుల సంఖ్య పెరుగుతున్నా లబ్ధి పొందుతున్న వారి సంఖ్య మాత్రం తగ్గుతూ వస్తోంది. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా ప్రతీ రైతు ఆధార్ నంబరు అనుసంధానం చేసుకోవాలనే నిబంధన ప్రభుత్వం విధించింది. పూర్తి స్థాయి అవగాహన లేక కొందరు అనుసంధానం చేసుకోలేదు. దీంతో వారు పథకానికి దూరమవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 17విడతల్లో రైతులకు పెట్టుబడి సాయం జమ చేసింది. ప్రారంభంలో ఉన్న రైతుల సంఖ్యతో పోల్చితే ప్రస్తుతం గణనీయంగా తగ్గింది. జిల్లాలోని 18 మండలాల్లో 1.43లక్షల మంది రైతులు ఉన్నారు. చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూరలనే లక్ష్యంతో ప్రారంభంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని ఐదెకరాలలోపు భూమి ఉన్న వారిని అర్హులుగా గుర్తించారు. అప్పుడు జిల్లాలో 85,557 మంది అర్హులు ఉండగా.. 17విడతల్లో వారి సంఖ్య 55,658 మందికి పడిపోయింది. పలు రకాల నిబంధనలు, షరతులతో చాలామంది పథకానికి దూరమవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లించేవారికి పథకాన్ని నిలిపివేశారు. కుటుంబంలో భార్యాభర్తలిద్దరికీ ఈ పథకాన్ని వర్తింపజేయగా ప్రస్తుతం కుటుంబంలో భార్య లేదా భర్తకు ఒక్కరికి మాత్రమే వర్తింపజేస్తున్నారు.

కొత్తవారికి అవకాశమేది..?

ఈ పథకంలో కొత్త రైతులకు అవకాశం దక్కడం లేదు. 2018-19లో ఈ పథకాన్ని ప్రారంభించగా కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరి ఒకటి వరకు పట్టాపాసుపుస్తకాలు ఉన్నవారికి మాత్రమే ఈ పథకం అమలు చేస్తోంది. అప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో వేలాది మంది రైతులు కొత్త పాసుపుస్తకాలు పొందారు. వారికి మళ్లీ అవకాశం కల్పించలేదు. వివరాల నమోదు కోసం వ్యవసాయశాఖ అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. విరాసత్ ద్వారా కొత్త పట్టాపాసు పుస్తకాలు పొందిన కొత్త రైతుల పేర్లను మాత్రమే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పోర్టల్ తీసుకుంటోంది. మరణించిన తండ్రి లేదా తల్లి గతంలో పీఎం కిసాన్ పథకంలో లబ్ధి పొందితేనే వారి వారసులకు విరాసత్ ద్వారా అందిన భూమికి పెట్టుబడి సాయం అందుతోంది. కొన్నేళ్లుగా కొత్త పట్టా పాస్‌పుస్తకాలు పొందిన రైతులు ఈ పథకంలో పేర్లు నమోదు కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

కొత్తవారికి అవకాశం ఇవ్వాలి..



పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో కొత్తగా పాస్‌పుస్తకం పొందిన రైతులకు కూడా అవకాశం కల్పించాలి. కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరికి ముందు పాస్ పుస్తకం ఉన్న వారికి మాత్రమే నగదు జమ చేస్తోంది.

– దుర్గం జైరాం, ఆలుగామ

ఒక్క పైసా పడలేదు..



నాకు నాలుగెకరాల భూమి ఉంది. రైతుబంధు వస్తుంది. కానీ ఇప్పటి వరకు ఇప్పటి వరకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి ఒక్క పైస పడతలేదు. అధికారులను అడిగితే ఈ మధ్య కాలంలో పట్టాపాసుపుస్తకం వచ్చిన వారికి అవకాశం లేదని చెబుతున్నారు. రూ.6వేలు వస్తే పెట్టుబడికి ఉపయోగపడేవి.

– సంతోష్, రాంపూర్

వైరల్ ఫీవర్

- 6, 9వ వార్డుల్లో ఇద్దరికి డెంగీ లక్షణాలు
- దోమల ఆవాసాలుగా మురికి కాలువలు



ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలో వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. ఒక్కో వార్డులో పదుల సంఖ్యలో జ్వర బాధితులు ఉన్నారు. చికిత్స కోసం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి రోజువారీగా వస్తున్న సంఖ్యనే అందుకు నిదర్శనం. గత నెలలో పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల నుంచి 995మంది జ్వర బాధితులు ఆస్పత్రికి రాగా.. మరో 219మంది ఇన్‌పేషెంట్లుగా చేరారు. వీరిలో మున్సిపాల్టీ నుంచి 300పైచిలుకు మంది అవుట్‌పేషెంట్లు, 50కి పైగా ఇన్‌పేషెంట్లు ఉన్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా ప్లేట్‌లెట్స్ తగ్గి, తీవ్రమైన నీరసం ఉంటే కానీ జ్వర బాధితులు ఆస్పత్రికి రావడం లేదు. కొందరు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. క్రమంగా జ్వరాల తీవ్రత పెరుగుతుండడంతో పట్టణ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

డెంగీ లక్షణాలు

పట్టణంలోని 6, 9వ వార్డుల్లో జ్వరాల తీవ్రత అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. కొందరు జ్వర పీడితుల్లో డెంగీ లక్షణాలు బయటపడినట్లు తెలుస్తోంది. ఆరో వార్డుకు చెందిన చరణ్, 9వ వార్డులో పాగిడి రాయమల్లమ్మకు డెంగీ జ్వరం వచ్చినట్లు కౌన్సిలర్ రాములునాయక్ తెలిపారు. దీంతో ఆయా వార్డుల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరికొన్ని వార్డుల్లోనూ కొందరు డెంగీ జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. జ్వర బాధితులకు ఏరియా ఆస్పత్రిలో డెంగీ పరీక్షలు నిర్వహించకపోవడంతో నిర్ధారణ కావడం లేదు. వైరల్ ఫీవర్‌గా నమోదు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో డెంగీ జ్వరం వచ్చినప్పటికీ బయటపడడం లేదు. ప్రైవేటుగా రక్తపరీక్షలు చేసుకుంటే డెంగీ జ్వరం వచ్చినట్లు నిర్ధారణ అవుతోంది.

దోమల సంతతి పెరిగి..

మున్సిపాల్టీలో పారిశుధ్యం నిర్వహణ అధ్వానంగా మారింది. 34వార్డులు ఉండగా ఏ వార్డులోనూ సక్రమంగా పనులు జరగడం లేదనే విమర్శలున్నాయి. రోజుల తరబడి చెత్త సేకరించడం లేదు. ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయి ఉంటోంది. మురికి నీటి కాలువల్లో నెలల తరబడి పూడిక నిండి ఉంటోంది. ఇళ్ల పరిసరాలు, రోడ్లు, ఖాళీ స్థలాల్లో గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగాయి. వీటిలో దోమలు ఆవాసాలు ఏర్పాటు చేసుకుని సంతతిని పెంచుకుంటున్నాయి. దోమకాటుతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ప్రతీ రోజు మురికి నీటి కాలువలు, ఇళ్ల పరిసరాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయాల్సి ఉన్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దోమల నిర్మూలనకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నాలుగు రోజుల నుంచి జ్వరం



నాలుగు రోజుల నుంచి జ్వరం వస్తోంది. మాత్రలు వేసుకున్నా తగ్గకపోవడంతో ఆసుపత్రికి వచ్చిన. ఆసుపత్రిలో రక్త పరీక్ష చేసి వైరల్ ఫీవర్ అని చెప్పారు. నాలెక్కనే ఇంకొంతమంది కూడా జ్వరంతో బాధ పడుతున్నారు. జ్వరాలు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నిహారిక, బెల్లంపల్లి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



మున్సిపాలిటీలోని పరిసరాల పరిశుభ్రత సరిగా లేదు. మురికివాడల వైపు కన్నెత్తి చూడడం లేదు. రొచ్చుగుంటలు, మురికి నీటి కాలువల్లో దోమలు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నా ఫాగింగ్ చేయించడం లేదు. స్ప్రేయింగ్ చేయిస్తున్నా దోమల నివారణ సాధ్యం కావడం లేదు. 6, 9వ వార్డుల్లో డెంగీ జ్వరాలు వస్తున్నాయి. వీటి నివారణకు సత్వర చర్యలు తీసుకోవాలి.

– రాములునాయక్, మున్సిపల్ కౌన్సిలర్

నెరవేరిన వర్గీకరణ కల

- మాదిగల పోరాటానికి దక్కిన ఫలితం
- సంబరాలు చేసుకుంటున్న నాయకులు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాతమంచిర్యాల: ఎస్సీ, ఎస్టీల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు గురువారం తీర్పునివ్వడంతో మాదిగ సంఘాల నాయకుల కల నెరవేరింది. అణగారిన వర్గాలుగా ఉన్న తమకు రిజర్వేషన్లు దక్కడం లేదని, రిజర్వేషన్లపై పోరాటానికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పేరుతో ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా మాదిగలు చేసిన అనేక పోరాటాలకు ఫలితం దక్కింది. మాదిగలకు అనుకూలంగా తీర్పు రావడంతో నాయకులు సంతోషం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. బాణాసంచాలు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు గ్రామాల్లో పాలాభిషేకాలు చేశారు. జిల్లా కేంద్రం మంచిర్యాలలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూర్ సమ్మయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మందకృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాదిగ సంఘాల నాయకులు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల్లో మాలమాదిగలకు వారి ఉప కులాలకు ఉమ్మడి రిజర్వేషన్లు ఉండడం వల్ల మాదిగ ఉపకులాలకు చెందిన వారు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి పోతున్నారని తెలిపారు. ఉమ్మడి రిజర్వేషన్ల వల్ల మాదిగలకే ఎక్కువ నష్టం జరుగుతోందని అన్నారు.

స్వాగతిస్తున్నాం..

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పోరాటాలను గుర్తించి మాదిగలకు రిజర్వేషన్లు అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం. రాష్ట్రాలు ప్రత్యేక ఆర్డినెన్సు తీసుకువచ్చి మాదిగలకు అన్ని రంగాల్లో త్వరగా రిజర్వేషన్లు అమలు చేయాలి.

– చంద్రగిరి నరేష్, మాదిగ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

60 ఉపకులాలకు ప్రయోజనం

అణగారిన కులాలుగా ఉన్న మాదిగ ఉపకులాలకు రిజర్వేషన్లు అమలు జరిగితే మాదిగల్లో ఉన్న 60 ఉపకులాలకు న్యాయం జరుగుతుంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రిజర్వేషన్ల కల నెరవేరింది మాదిగలకు నేడు పండగ రోజు.

– మోతే పోషం, మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి

సుదీర్ఘ పోరాట ఫలితం

30 సంవత్సరాలుగా మాదిగల కోసం అనేక ఉద్యమాలు చేసి అవమానాలు భరించి జాతి కోసం ఉద్యమాన్ని నడిపిన మంద కృష్ణమాదిగకు యావత్ మాదిగ జాతి రుణపడి ఉంటుంది. ఆయన పోరాట ఫలితంగా నేడు మాదిగల రిజర్వేషన్ల కల నెరవేరింది.

– చెన్నూరు సమ్మయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు

సీఎం బేషరతుగా క్షమాపణ చెప్పాలి



రాస్తారోకోలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



నిరసనలో మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య, నాయకులు

- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ఆడబిడ్డలను కించపర్చేలా అసెంబ్లీలో మాట్లాడడం బాధాకరమని, ఆయన వెంటనే తన మాటలను వెనక్కి తీసుకుని బేషరతుగా సబితారెడ్డికి క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు గురువారం స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద రాస్తారోకో చేశారు. అనంతరం బీఆర్ఎస్పీ నాయకులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని అన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, లక్సెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

బెల్లంపల్లి: సీఎం రేవంత్‌రెడ్డి మహిళలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం బెల్లంపల్లిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కాంటా చౌరస్తా వద్ద రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి నిప్పంటించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, సునీతలక్ష్మారెడ్డిలను ఉద్దేశించి సీఎం చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలిపారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్, నాయకులు రేవెల్లి విజయ్, టి.మల్లయ్య, కొమురయ్య, రాకేష్, కిరణ్, సుమన్, టీబీజీకేఎస్ నాయకుడు సాజన్, మాజీ కౌన్సిలర్ ఎల్.రాములు, అలీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలప పట్టివేత


పట్టుకున్న కలపతో బీట్ అధికారి, సభ్యులు

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ తాళ్లపేట్ రేంజ్ ఊట్ల బీట్ పరిధిలో బైక్లపై అక్రమంగా తరలిస్తున్న కలపను అటవీ అధికారులు పట్టుకున్నారు. రేంజ్ అధికారి సుష్మారావు కథనం ప్రకారం.. ఊట్ల బీట్ పరిధిలో పెట్రోలింగ్ చేస్తున్న డీఆర్వో పోచమల్లు, బీట్ అధికారి సాయికి బుధవారం రాత్రి కడెం ప్రధాన కాలువ సమీపంలో బైక్లు కనిపించాయి. అటువైపు టార్చిలైట్ వేయగా, కలప దుంగలను పడేసి బైక్లపై పారిపోయారు. మూడు సైజులు, 8 వాసాలు మొత్తం 0.421 సీఎంటీ కలప పట్టుకున్నట్లు రేంజ్ అధికారి తెలిపారు. వీటి విలువ రూ.33,844 ఉంటుందని పేర్కొన్నారు.

లారీడ్రైవర్కు ఐదేళ్ల జైలు

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన వీరభద్రరావు మృతి కారణమైన లారీడ్రైవర్కు ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ. 2వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ గురువారం తీర్పునిచ్చారు. రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం.. బెల్లంపల్లి ఓసీపీలో డ్రైవర్గా విధులు నిర్వహించే వీరభద్రరావు 2019, సెప్టెంబర్ 12న విధులు ముగించుకుని రెబ్బెన వస్తుండగా లారీ ఢీకొట్టింది. వీరభద్రరావు అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య సమ్మక్క ఫిర్యాదుతో కేసు నమోదైంది. లారీడ్రైవర్ ఎండీ సలీంని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా పీపీ జగన్మోహన్రావు సాక్షులను విచారించి నేరం రుజువు చేయడంతో న్యాయమూర్తి ఈ మేరకు తీర్పునిచ్చారు. అలాగే లారీ యజమానికి రూ. వెయ్యి జరిమానా విధించారు. నిందితుడికి శిక్షపడేలా కృషిచేసిన ప్రస్తుత డీఎస్పీ సదయ్య, రెబ్బెన సీఐ, ఎస్సై, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ రామ్సింగ్, కోర్టు సిబ్బందిని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

ఆసిఫాబాద్అర్బన్: మండలంలోని వాడిగుడ రహదారిపై గురువారం బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలయ్యాయి. మాలన్గొందికి చెందిన మడావి రవి తలకు, చెవికి గాయమైంది. పలువురు గమనించి అతన్ని ఆటోలో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి రెఫర్ చేశారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

కాగజ్నగర్రూరల్: పట్టణంలోని సర్సిల్క్ కాలనీ, రాజీవ్గాంధీ చౌరస్తా, ఓల్డ్ కాలనీల్లో గురువారం పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలయ్యాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో వారు చికిత్స పొందారు.

వామ్మో రక్తపింజరలు

- బెల్లంపల్లిలో సంచారం
- భయాందోళనలో ప్రజలు


ఓ వీధిలో రోడ్డుపైకి వచ్చిన రక్తపింజర పాము

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో విషసర్పాల సంచారం విపరీతంగా పెరిగింది. నాగుపాము, కొండ చిలువలతోపాటు ప్రమాదకరమైన రక్తపింజర పాములు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. గడిచిన ఐదేళ్లలో ఏటా ఒకటి, రెండు మాత్రమే దర్శనమిచ్చే ఇవి ప్రస్తుతం వందల సంఖ్యకు చేరుకున్నట్లుగా తెలుస్తోంది. కెమికల్ ఏరియా, కాల్టెక్స్, రాంనగర్, కుంటరాములు బస్తీ తదితర ప్రాంతాల్లో వీటి బెడద ఉంది. దీంతో పురప్రజలు భయం భయంగా గడుపుతున్నారు. నాగుపాము, కొండ చిలువలు ఇళ్ల పరిసరాల్లో ఇబ్బడి ముబ్బడిగా సంచరిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. గ్రామీణ ప్రాంతాలను మించి బెల్లంపల్లిలో లెక్కకు లేనన్ని విషసర్పాలు సంచరిస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

పాముల సంచారం

వర్షాకాలం కావడంతో ఇళ్ల పరిసరాలు, రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి పాములకు నిలయంగా మారాయి. శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్న ఇళ్లు, భవనాల్లో పాములు ఆవాసాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. చెట్లు, పుట్టల్లో నుంచి పాములు, తేళ్లు బయటకు వచ్చి ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. శాంతిఖని బస్తీ, 65 డీప్ ఏరియా, సుభాష్నగర్, నెంబర్-2 ఇంక్లైన్ బస్తీ, రైల్వే రడగంబాల బస్తీ, రైల్వేస్టేషన్ ఏరియా, సుబ్బారావుపల్లి, పెద్దనపల్లి, హౌజింగ్ బోర్డు కాలనీ, కాల్టెక్స్, గంగారాంనగర్, గాంధీనగర్, కన్నాల బస్తీ, మధునన్ననగర్, టేకులబస్తీ, కొత్తబస్టాండ్ ఏరియా ఇందిరమ్మకాలనీ, కాంట్రాక్టర్ బస్తీ, షంషీర్నగర్, అంబేద్కర్నగర్, రవీందర్నగర్, బెల్లంపల్లి బస్తీ, గోల్ బంగ్లా, బాబుక్యాంపు బస్తీ, అశోక్నగర్, భూడిదగడ్డ బస్తీ, రాంనగర్ తదితర ప్రాంతాల్లో పాముల సంచారం అధికంగా ఉంది. దీంతో వృద్ధులు, పిల్లలు, మహిళలు భయపడుతూ రోజువారీగా అప్రమత్తంగా ఉంటున్నారు. మున్సిపాలిటీలో ఇప్పటివరకు ఏ ఒక్కరు కూడా పాముకాటుకు గురికాకుండా స్వీయ నియంత్రణ చర్యలు తీసుకోవడం గమనార్హం.

పట్టించుకోని అధికారులు

శివారు బస్తీలను ఆనుకుని అటవీ ప్రాంతం ఉండటంతో ఆ వైపు నుంచి విషసర్పాలు వస్తున్నాయి. వర్షాకాలంలో సర్పాల నుంచి ప్రజలను రక్షించడానికి చర్యలు తీసుకోవల్సిన మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లిప్తతను వీడి చర్యలు చేపట్టాలని పుర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పాముల బెడద ఉంది



వర్షాకాలంలో పాముల బెడద తీవ్రంగా ఉంది. వీటి నుంచి ప్రాణాలను కాపాడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నాం. ఏటా పాముల బెడద ఉన్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైన శ్రద్ధపెట్టి పాముల నుంచి ప్రజలను కాపాడాలి.

– కె.ప్రకాశ్, పురవాసి

సంతతి పెరిగింది



ఐదేళ్లపైబడి నుంచి బెల్లంపల్లి చుట్టుపక్క ప్రాంతాల్లో పాములు పడుతున్నాను. వాటిని సురక్షితంగా పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలి వేస్తున్నాను. గతంలో ఎన్నడూ లేనంతగా రక్తపింజర పాములు సంచారం చేస్తున్నాయి. రెండు నెలల్లో 300కు పైగా రకరకాల పాములు పట్టుకోగా వీటిలో 100 వరకు రక్తపింజరలను పట్టుకున్నాను. ఈ పాముల సంతతి బెల్లంపల్లిలో క్రమంగా వృద్ధి చెందుతున్నట్లుగా కనిపిస్తోంది.

– దుర్గ రాజేశ్, పాములు పట్టే వ్యక్తి

కొరవడిన పర్యవేక్షణ

- ఇష్టారాజ్యంగా వంతెన నిర్మాణం
- నాణ్యతలేమితో పనులు


నర్సింగాపూర్లో నాసిరకంతో వంతెన పనులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం బుగ్గగట్టు నుంచి నర్సింగాపూర్ వెళ్లేదారిలో ఇటీవల వంతెన నిర్మాణం చేపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపించడంతో సదరు కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నాడు. అతితక్కువ ఎంఎం స్టీల్ వాడుతూ వంతెన పిల్లర్ల పనులు చేపడుతుండగా ఎలాంటి నాణ్యత లేకుండా నాసిరకం పనులు సాగుతున్నాయి. గతేడాది వరదల సమయంలో ఎఫ్డీఆర్ కింద రూ.60 లక్షలు వంతెన నిర్మాణ కోసం కేటాయించారు. మంచిర్యాలకు చెందిన ఓ కాంట్రాక్టర్ చేపట్టాల్సిన పనులు దాదాపు 10 నెలల ఆలస్యంతో హాజీపూర్ మండలానికి చెందిన ఓ కాంట్రాక్టర్కు సబ్ కాంట్రాక్ట్ ఇచ్చారు. ప్రస్తుతం పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. పంచాయతీ రాజ్ జేఈ సుబ్బారెడ్డి పర్యవేక్షణ లేకపోవడంతో సబ్ కాంట్రాక్టర్కు వరంగా మారింది. దీంతో పనుల నాణ్యతకు తిలోదకాలు పలికి లాభాపేక్షతో పనులు చేపడుతున్నారు.

రైతుల అవస్థలు

నర్సింగాపూర్, నంనూర్ గ్రామాల శివారులోని రైతులు తమ వ్యవసాయ పనులకు వెళ్లేవారు ఇబ్బందులకు గురవుతున్నారు. వంతెన పనులు చేపట్టే సదరు కాంట్రాక్టర్ ప్రత్యామ్నాయంగా తాత్కాలిక రహదారి ఏర్పాటు చేయలేదు. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వర్షాకాలం కావడంతో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. దీంతో రైతులు అదనంగా మరో 10 కి.మీ మేరకు ప్రయాణం సాగించి వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. తాజాగా గురువారం ఓ రైతు ఎడ్లబండిపై వంతెన పక్కన నీటి నుంచి వెళ్తుండగా గుంతల్లో దిగబడింది. స్థానికులు గమనించి అతనితో పాటు ఎడ్లను రక్షించి బయటకు తీసుకువచ్చారు. అప్పుడే వచ్చిన కాంట్రాక్టర్ ఇదంతా చూసి కూడా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో స్థానికులు విస్తుపోయారు.

రహదారి ఏర్పాటుకు చర్యలు

కల్వర్టు నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్ను మందలిస్తాం. రెండు రోజుల్లో రైతులు వ్యవసాయ పనులకు వెళ్లేలా రహదారి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– హరీశ్, డీఈ, పంచాయతీ రాజ్

భర్త గొంతు నులిమి హత్యచేసిన భార్య అరెస్టు

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఘాతుకం
- వివరాలు వెల్లడించిన రూరల్ సీఐ రాంబాబు


వివరాలు వెల్లడిస్తున్న కాగజ్నగర్ రూరల్ సీఐ

దహెగాం: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను గొంతునులిమి హత్య చేసిన భార్యను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం స్థానిక పోలీస్టేషన్లో కాగజ్నగర్ రూరల్ సీఐ రాంబాబు ఈ మేరకు వివరాలు వెల్లడించారు. పెంచికల్పేట్ మండలం ఎల్లూర్ గ్రామానికి చెందిన సుజాతకు దహెగాంకు చెందిన బండ మల్లేశ్తో గత 13 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు కుమార్తె ఉంది. వీరిది వ్యవసాయ కుటుంబం. మల్లేశ్ ఇంటి పక్కన ఉన్న గుర్లె రాజు వ్యవసాయం చేస్తుంటాడు. వ్యవసాయ కూలీ పనికి సుజాత వెళ్తుండేది. ఈ క్రమంలో రాజుతో ఆరేళ్ల క్రితం వివాహేతర సంబంధం ఏర్పడింది. వీరి విషయం గతేడాది భర్తకు తెలిసింది. మద్యానికి అలవాటు పడి భార్యతో జరిగిన గొడవలో మల్లేశ్కు గాయపడ్డాడు. నాలుగు నెలలుగా విడిపోయి ఉన్నారు. పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి ఏకం చేశారు. అయినా సుజాతలో మార్పు రాలేదు. రాజుతో వివాహేతర సంబంధం కొనసాగించింది. ఈ విషయమై గతనెల 25న భార్యభర్తలు గొడవపడ్డారు. వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని ఎలాగైనా తొలగించుకోవాలని రాజు ప్రోత్సాహంతో గొంతు నులిమింది. తర్వాత కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించి ఇంటికి తీసుకవచ్చారు. మాట రాకపోవడంతో గతనెల 28న తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి అన్నయ్య బండ సత్తయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టారు. సుజాత, గుర్లె రాజుని రిమాండ్కు తరలించామని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టేకుచెట్ల నరికివేత


స్మగర్లు వదిలేసివెళ్లిన టేకు దుంగ

భీమారం: మంచిర్యాల అటవీ డివిజన్ పరిధిలోని భీమారం, ఎలకేశ్వరం బీట్లలో స్మగ్లర్లు గొడ్డళ్లతో టేకు చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు తరలించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లాలో అధికంగా టేకు ప్లాంటేషన్లు ఉన్న ఈ రెండు బీట్లలో నాలుగురోజుల క్రితం దాదాపు 10 చెట్లని తొలగించారు. ఫర్నిచర్కు అవసరమైన కర్రని తీసుకుని తరలించారు. అధికారుల రాకను గమనించి అవసరం లేని మిగతా చెట్టు బాగాలను అక్కడే వదిలి వెళ్లారు. గతంలో టేకు వనాల రక్షణకు ఏర్పాటు చేసిన బేస్ క్యాంపులు తొలగింపుతో పర్యవేక్షణ కరువైంది. కాగా, భీమారం, ఎలకేశ్వరంతోపాటు దాంపూర్ సెక్షన్లో టేకు చెట్ల నరికివేత కొనసాగుతోంది. ఉన్నతాధికారులు వెంటనే పట్టించుకుని టేకు ప్లాంటేషన్లని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఏరియా ఆసుపత్రి కోసం నిరాహార దీక్ష


ఏరియా ఆసుపత్రి ఎదుట దీక్షలో నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని సింగరేణి ఏరియా ఆసుపత్రి ఎదుట గురువారం ఏరియా ఆసుపత్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పరిరక్షణ కమిటీ నాయకులు మాట్లాడుతూ సింగరేణి ఏరియా ఆసుపత్రిని నిర్వీర్యం చేసి ఎత్తివేతకు గుట్టుగా యత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వార్డులు కుదించి వైద్యులు, సిబ్బంది పోస్టులను ఉద్దేశపూర్వకంగా భర్తీ చేయడం లేదని పేర్కొన్నారు. ఆసుపత్రిని అభివృద్ధి చేసి యథావిధిగా కొనసాగించి, వైద్యసేవలను మెరుగుపర్చాలని, అప్పటివరకు పోరాట కార్యక్రమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీక్షలో కమిటీసభ్యులు డి.ఆర్.శ్రీధర్, మణిరాంసింగ్, కృష్ణ, కె.శంకరయ్య, జి.వెంకటయ్య, దేవదాస్, రమణ, రాంచందర్, ఎండీ.గౌస్, వినయ్కుమార్, ఖాదర్, చాంద్పాషా, నారాయణ, గోపాల్, లక్ష్మీనారాయణ, ఎస్.శంకర్, వెంకటేష్, తిరుపతి, రాజం, జి.శంకర్ తదితరులు కూర్చున్నారు. దీక్షకు మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ నాయకులు మత్తమారి సూరిబాబు, చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్, ఎస్.రాజమొగిలి, పేరం శ్రీనివాస్, గెల్లి జయరాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో 91 శాతం బొగ్గు ఉత్పత్తి


మాట్లాడుతున్న ఏరియా జీఎం రవిప్రసాద్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా గత జులైలో 91 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించినట్లు ఏరియా జీఎం రవిప్రసాద్ తెలిపారు. గోలేటి టౌన్షిప్లోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. గత నెలలో ఏరియాకు 2.40లక్షల టన్నులకు గాను 2.18 టన్నులతో 91 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. కైరిగూడ ఓసీపీలో 2.4లక్షల టన్నులకు గాను 2.18 లక్షల టన్నులు సాధించామని అన్నారు. 23 రోజులుగా ఏరియాలో వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడిందన్నారు. ఓబీ వెలికితీత పనులకు అంతరాయం కలిగిందన్నారు. అయినా బొగ్గు ఉత్పత్తికి ప్రక్రియ నిరాటంకంగా సాగించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. క్వారీలో మోటార్లు ఏర్పాటు చేసి వర్షపు నీటిని తోడి బయటకు పంపిస్తున్నామని అన్నారు. సమావేవంలో డీజీఎం ఐఈడీ ఉజ్వల్కుమార్ బెహెరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

వార్డుల్లో పారిశుధ్య పనులు


స్ప్రేయింగ్ చేయిస్తున్న కమిషనర్

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని 6, 9వ వార్డుల్లో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఆయా వార్డుల్లో డెంగీ జ్వరాలు వస్తున్నట్లు కౌన్సిలర్ రాములునాయక్ కలెక్టర్కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ బెల్లంపల్లిలో ఉన్న డెప్యూటీ డీఎంహెచ్వోకు సమాచారం చేరవేశారు. దీంతో వైద్యసిబ్బంది జ్వర పీడితులకు వైద్యపరీక్షలు చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు శానిటేషన్ సిబ్బందితో పారిశుధ్య పనులు చేయించారు. జేసీబీతో మురికి నీటి కాలువల్లో పూడిక తీయించి మురికినీరు నిలువకుండా చేశారు. ఇళ్లు, పరిసరాల్లో, మురికినీటి గుంతల్లో స్ప్రేయింగ్ చేయించారు. కౌన్సిలర్ రాములునాయక్ మాట్లాడుతూ ఆయా వార్డుల్లో డెంగీ జ్వరాలు ప్రబలుతుండడంతో వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చేసి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. డెంగీ బాధితులు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ వైకుంఠం, డాక్టర్ సౌజన్య, టీఎంటీ దుర్గయ్య, ఏఎన్ఎం స్రవంతి, వైద్య, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పవర్ ప్లాంటు కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

జైపూర్: పవర్ ప్లాంటు కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందని హెచ్ఎంఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత రెండేళ్లుగా హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్తో చర్చలు నడుస్తున్నాయన్నారు. డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ డైరెక్టర్తో మీటింగ్ ఏర్పాటు చేయమని ఆదేశాలు జారీ చేసినా యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికి యూనియన్లతో మీటింగ్ ఏర్పాటు చేయలేదన్నారు. వెంటనే మీటింగ్ ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్టీపీసీలో మాదిరిగా ఇక్కడి కార్మికులకు అలవెన్సులు అమలు, పనికి తగిన వేతనాలు చెల్లించాలన్నారు. హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులతో జీఎం శ్రీనివాసులు సాయంత్రం సమావేశం నిర్వహించి కార్మిక సమస్యలపై చర్చించారు. నాయకులు జక్కుల నారాయణ, హెచ్ఎంఎస్ ఎస్టీపీపీ జనరల్ సెక్రెటరీ విక్రమ్కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్రెడ్డి, సెక్రెటరీ సాయికృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సంపత్, ట్రెజరీ సత్యనారాయణచారి, జాయింట్ సెక్రెటరీ అజాద్, మల్లికా పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేవైఎం నాయకులపై కేసు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలో అనుమతి లేకుండా ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసిన 25 మంది బీఆర్ఎస్ నాయకులు, 8 మంది బీజేవైఎం నాయకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త చట్టం ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు చేపట్టవద్దని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించాలి


తల్లులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న అనిత

మంచిర్యాలటౌన్: పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించాలని, బిడ్డకు తల్లిపాలు అమృతం వంటివని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత అన్నారు. జిల్లా కేంద్రంలోని చున్నంబట్టి వాడ అంగన్వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్వో మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలను బిడ్డకు పట్టించి, ఆరు నెలల వరకు తల్లిపాలను మాత్రమే తాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో ఏ.విజయలక్ష్మి, సూపర్వైజర్లు సులోచనదేవి, జ్యోతి, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ బి.రజిత, ప్రాజెక్టు అసిస్టెంట్ టి.శ్యామల, బ్లాక్ కోఆర్డినేటర్ కే.సతీశ్, అంగన్వాడీ టీచర్లు వనిత, కాంతకృష్ణ, రేణుక, శ్రీలక్ష్మీ, నసీమ, రాంనగర్ సెక్టార్ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి


విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్


మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలతో భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఇన్స్పైర్ జాతీయ స్థాయిలో విజేతగా నిలిచి జపాన్, ఇంటర్నేషనల్ సైన్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్కు ఎంపికైన జిల్లా కేంద్రంలోని రాజీవ్నగర్ కేజీబీవీ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి విద్యాసింగ్ను గురువారం కలెక్టర్ చాంబర్లో డీఈవో ఎస్.యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి మధుబాబుతో కలిసి సన్మానించారు. మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం జీవితచరిత్ర 'వింగ్స్ ఆఫ్ ఫైర్' పుస్తకాన్ని అందజేసి భవిష్యత్లో రాణించాలని తెలిపారు. కస్తూరిబా బాలికల పాఠశాల ప్రత్యేక అధికారి స్వప్న, ఉపాధ్యాయులు మమత పాల్గొన్నారు.

క్రికెట్లో క్రీడాకారులు రాణించాలి


క్రికెట్ ఆడుతున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి: క్రికెట్ పోటీల్లో గ్రామీణ ప్రాంత క్రీడాకారులు రాణించాలని బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్ అన్నారు. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో గురువారం బెల్లంపల్లిలోని ఏఎంసీ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి అండర్-19, అండర్-23 విభాగాల్లో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఏసీపీ రవికుమార్ పోటీలను ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు నాతరి స్వామి, బండి ప్రభాకర్, క్రికెట్ అసోసియేషన్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, కోచ్ శేఖర్, గౌతమ్, పీఈటీలు ఇమ్మానియేల్, అజీజుద్దీన్, శ్రీకాంత్, గోకుల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

భార్యతో గొడవపడి.. నగదు, బంగారంతో పరారీ


వెంకటేశ్(ఫైల్)

వాంకిడి: మద్యానికి బానిసై ఓ వ్యక్తి భార్యతో గొడవపడి ఇంట్లో నగదు, బంగారు నగలు తీసుకుని పరారయ్యాడు. మండలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై సాగర్ కథనం ప్రకారం.. ఖిరిడి గ్రామానికి చెందిన వడై వెంకటేశ్ మద్యానికి బానిసై భార్య ఇందిరాబాయితో గొడవ పడేవాడు. ఈక్రమంలో జూలై 30న మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. ఉదయాన్నే మద్యం తాగడం ఏంటని, చేనుల్లో పని చేసుకుంటే ఏమవుతుందని భార్య మందలించింది. ఈ క్రమంలో భార్యను వెంకటేశ్ బూతులు తిడుతూ కొట్టడానికి వచ్చాడు. ఇద్దరు కుమారులు జోక్యంతో గొడవ సర్దుమణిగింది. అదే రోజు కుమారులను తీసుకుని ఇందిరాబాయి చేన్లో పనులకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి చేరుకుంది. బీరువా పగలగొట్టి అందులో రూ.8 వేల నగదు, రెండు తులాల బంగారం కనిపించలేదు. భర్త ఆచూకీ కోసం వెతికినా దొరకలేదు. ఇందిరాబాయి ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చసినట్లు ఎస్సై తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం


అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

నస్పూర్: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట చంద్రశేఖర్ తెలిపారు. గురువారం సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ సీసీసీ టౌన్షిప్లో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న తమ కల నెరవేరిందని అన్నారు. ఈ విజయాన్ని ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలర్పించిన అమరులకు అంకితం ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు కోండ్ర లింగయ్య, కొప్పర్తి రాజం, నాయకులు ఇరికిల్ల పురుషోత్తం, చంద్రయ్య, కడారి రమేశ్, ఉదయ్, అట్కపురం సమ్మయ్య పాల్గొన్నారు.

సింగరేణి బొగ్గుబ్లాకులు సంస్థకే దక్కేలా కృషి

కాసిపేట: సింగరేణి బొగ్గు బ్లాకులు సంస్థకే దక్కేలా ఐఎన్టీయూసీ కృషి చేస్తోందని కేంద్రకమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవిభూమయ్య తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఐఎన్టీయూసీ బాయి బాటలో భాగంగా గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్లో ఆయన మాట్లాడారు. సింగరేణిని ప్రైవేట్ పరం చేయం అంటూనే బీజేపీ నేతలు బ్లాకులు వేలానికి పెట్టడం దారుణమన్నారు. కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లూరి లక్ష్మణ్, కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరి రాంశెట్టి నరేందర్, కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి మిట్ట సూర్యనారాయణ, ఏరియా కార్యదర్శి దొరిశెట్టి చెందశేఖర్, రాపర్తి శ్రీనివాస్, శంకర్రావు, బన్న లక్ష్మణ్ దాస్, ఈదునూరి బాపు తదితరులు పాల్గొన్నారు.